
# కుబేరుడి కండువా




**కలువకొలను సదానంద**

ప్రశాంతంగా ఉండే తటాకంలో రాయి పడింది.

ఒకటి రెండు రోజుల్లోనే చారికి కొంత డబ్బు కావాలి. అతని దృష్టిలో అది పెద్ద మొత్తమే!

చారి అతి సామాన్యుడే అయినా, ఉన్నంతలో సంసారాన్ని గుట్టుగా గడుపుకుంటున్న జాగరూకు డతను. అందుచేత, సాధారణంగా అప్పుకోసం వెతుక్కునే అవసరం తెచ్చిపెట్టుకునేవాడు కాదు. కానీ, ఇప్పుడు తప్పదు.

ఊళ్లో ఉన్న కొద్దిమంది సంపన్నుల్లో ముకుందం ఒకడు. అతడు చారికి బాల్యమిత్రుడు. చిన్నప్పుడు తనతో కలిసి చదువుకున్నవాడు.

ఆ ఉదయం ముకుందం కోసం బయలుదేరాడు చారి. ముకుందం ఇంట్లో లేడు. మండీ దగ్గరికి వెళ్లాడు చారి. "మిల్లులో ఉన్నాడేమో, పోయి చూడు!' ' అన్నారు అక్కడివాళ్లు.

చారి ముకుందాన్ని మిల్లులో చూశాడు. "గుడ్ మార్నింగ్!" చెప్పాడు. తెల్లటి పైజమా మీద సిల్కు జుబ్బా తొడుక్కున్న ముకుందం వేళ్ల నిండా ఉంగరాలు, బంగారు గొలుసు, రిస్టు వాచీ మొదలైన నిత్యాభరణాలతో శోభిల్లుతున్నాడు.

"ఏం చారీ! ఇలా వచ్చావు?" అని అడిగాడు ముకుందం బిగ్గరగా.

మేరు పర్వతంవంటి ముకుందంముందు నిలబడిన చారికి తన అల్పత్వం బెల్జియం అద్దంలో ప్రతిబింబంలా తేటగా కనిపించింది. "మరేం లేదు, ముకుందం! ఒక ఐదు వందలు కావాలి. మళ్లీ ఇచ్చేస్తాను!" అన్నాడు దీనాతిదీనంగా.

"అయిదు వందలా! ఇప్పుడు నా దగ్గర లేదే! ఎప్పుడు కావాలి?"

"పెళ్లికి వెళ్లిరావాలి. శుక్రవారం ఉదయం ముహూర్తం. చాలా దగ్గరి చుట్టాలు. గురువారం బయలుదేరాలని అనుకుంటున్నాము" అన్నాడు చారి.

ముకుందం ఐదు సెకన్లు ఆలోచించాడు. "తిరిగి ఎప్పు డిస్తావు?"

"జీతం రాగానే ఇస్తాను!" టక్కున చెప్పాడు చారి.

"వెంకటేశం ఐదువంద లివ్వాలి. ఈ రోజు ఇస్తా నన్నాడు. తీసి పెడతాను, చారీ! సాయంకాలం ఒకసారి కనిపించు!"

చారి సంజవేళ కోసం ఎదురు చూడసాగాడు.

ముకుందం తనకు డబ్బిస్తాడు. ఆ బాకీ తాను ఎప్పుడు చెల్లించాలి? ఒకటో తారీఖున! చెల్లించగలడా తను? చెల్లించవచ్చు. అయితే, వెనువెంటనే మరెవరినైనా మూడు నాలుగు వందలు అప్పు అడగవలసిన అవసరం కూడా ఉంది, తనవంటి తక్కువ జీతగాడికి. ఈ పద్ధతి ప్రతి నెల చర్విత చర్వణం కావడం తథ్యం. మధ్యలో మ రే ఆర్థి కావసరమూ వచ్చి పడకుంటే, మూడు నాలుగు నెలల్లోనే ఈ ఋణభారాన్ని దించుకోచ్చు. అయితే, విధి నమ్మరానివాడు!

సాయంకాలమైంది. కనిపించిన చారితో ముకుందం ఇలా అన్నాడు - "వెంకటేశం కనిపించలేదు, చారీ! నీ అదృష్టమేమో కానీ, నా దగ్గర డబ్బు లేకపోవడం అనేది ఎన్నడూ లేదు. సరే, ఉదయం రా!"

చారి ఆ రాత్రి నిరాశతో గడిపాడు. తెల్లవారింది. చారి మిల్లు దగ్గరకి వెళ్లాడు. మండీ దగ్గరికి వెళ్లాడు. ఇంటికి వెళ్లి వాకబు చేశాడు. ముకుందం జాడ కానరాలేదు. మూడు నాలుగు పర్యాయాలు ఈ విధంగా టౌన్ బస్సులా తిరిగేసరికి, ఏడుళ్ళ మణేగాడు ముకుందం మిల్లులోనే దొరికాడు. అత డీ రోజు పాంటూ, స్లాకూ తొడుక్కున్నాడు.

'కాస్సేపుండు, చారీ! నిన్న నువ్వు అటు వెళ్లగానే వెంకటేశానికి కబురు పంపాను. ఇప్పుడు తెచ్చిస్తా నన్నాడు. ఒరే సూరీ! వెంకటేశం దగ్గరకి వెళ్లిరా!'

మిల్లులో పనిచేసే కుర్రాడు వెంకటేశం ఇంటికి వెళ్లి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. "సాయంత్రం ఇస్తా నన్నాడు, బాబూ!"

చారి మళ్లీ సాయంకాలం వెళ్లాడు.

సూరి వెంకటేశం ఇంటికి వెళ్లి వచ్చాడు. "ఆయనే వస్తాట్ట! నన్ను వెళ్లమన్నాడు, బాబూ!" అన్నాడు.

గంట ఆరైంది. ఏడైంది. వెంకటేశం రాలేదు. అతనికోసం మళ్లీ సూరిగాణ్ణి పంపాడు ముకుందం. సూరిగాడు వెళ్లి వచ్చి, "ఆయన ఇంట్లో లేడు, బాబూ!' ' అన్నాడు. ఏడున్నరకు మళ్లీ ఓమారు వెళ్లి వచ్చి, "ఉదయం ఎనిమిది గంటలకల్లా తప్పకుండా వచ్చి ఇస్తాట్ట!" అన్నాడు.

"డామిట్!" అన్నాడు ముకుందం.

వెంకటేశం డామిట్ కావడానికి తాను కారకు డౌతున్నాడేమో నని మథన పడ్డాడు చారి.

గురువారం ఉదయం ఆశాలేశంతో మిల్లు దగ్గరికి వెళ్లాడు. ముకుందం ధోవతి కట్టుకున్నాడు. ఫుల్ షర్ట్ తొడుక్కున్నాడు. పైన కండువా వేసుకున్నాడు. చారిని చూచి కూర్చోమన్నాడు. చాలా గంభీరంగా ఉన్నాడు.

"ఒరే సూరీ! వెళ్లి వెంకటేశాన్ని పిలుచుకురా! ఇంట్లో లేకుంటే, ఎక్కడున్నాడో వెతికి పట్టుకురా!"

మరో అరగంటకు మృగరాజు చెంతకు తరలి వచ్చే అల్ప జంతువులా అల్లంత దూరంలో వెంకటేశం కనిపించాడు. వెనకనే సూరిగాడు ఉన్నాడు.

ముకుందం వీధిలోకి వచ్చి నిలబడ్డాడు. వెంకటేశం సమీపించాడు. అతను ఏదో చెప్పబోతున్నాడు. ముకుందం కండువా వెంకటేశం మెడ మీదికి విసిరి, ఎడమ చేతితో గట్టిగా లాగి పట్టుకున్నాడు. "మాటలు తరువాత! ముందు డబ్బు అక్కడ పెట్టు!"

... గారడీ వాడి చుట్టూ మూగినట్టు జనం నడుమ వినోద వస్తువులా నిలబడిన వెంకటేశం అవమానాతిశయంతో కంట తడిపెట్టుకున్నాడు.

"తలైనా తాకట్టు పెట్టి మధ్యాహ్నానికల్లా నీ డబ్బు నీకు చెల్లించుకుంటాను ..." సంజాయిషీ చెప్పుకుని, జీవన్మృతుడిలా అక్కడ నుంచి సాగిపోయాడు.

నిశ్చేష్టుడై నిలబడిపోయిన చారితో, "నువ్వు సాయంకాలం వచ్చి డబ్బు తీసుకెళ్లు చారీ!" అన్నాడు ముకుందం.

సాయంకాలం ఆఫీసు నుండి బయటపడ్డ చారి ముకుందం వద్దకు వెళ్లడానికి మారుగా, ఊరి బయటికి షికారు వెళ్లాడు. అతని మనస్సును ఏదో మూగ బాధ ఆవరించుకుంది. పాపం, వెంకటేశం! ముకుందానికి బాల్యమిత్రుడు! అతని డెస్కు మేటు! అతని నోట్సులన్నీ ఎప్పటికప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా రాసిపెట్టినవాడు! ఈ యోగ్యత లేవీ కూడా ఈనాడు జరిగిన భంగపాటునుండి అతన్ని తప్పించలేకపోయాయి.

చారి ఇల్లు చేరుకునేసరికి గంట ఏడైంది. అప్పటికే ముస్తాబై సిద్ధంగా ఉన్న అతని భార్య అరుంధతి అతన్ని చూచి చిటపటలాడింది. "ఇప్పటికైనా వచ్చారు, నయమే! మీకోసం గంట క్రితం కుర్రాడు వచ్చి పోయాడు. ముకుందంగారు రమ్మన్నారట!"

చారి విన్నాడు. కాళ్లూ, చేతులూ కడుక్కున్నాడు. "అన్నం వడ్డించు!" అన్నాడు.

ఆమె అన్నం వడ్డించి, "వెళ్లి వచ్చారా?" అని అడిగింది.

"లేదు."

భోజనం పూర్తయ్యాక, "వెళ్లి త్వరగా రండి మరి! రైలుకు వేళయింది" అంది అరుంధతి.

చారి విధిలేక బయలుదేరాడు.

తెల్లవారుజామున పెళ్లి ముహూర్తం. తానూ, తన భార్య వెళ్లగలిగి ఉంటే కలిగే తృప్తి కంటే, ఈనాడు వెంకటేశానికి కలిగిన ఘోర విపత్తు తనకు కలగబోదు అన్న సంతృప్తి ఎన్నో వేల రెట్లు హెచ్చుగా కనిపించిం దతనికి.

ఒక గంటసేపు పురవీధుల్లో యథేచ్ఛగా సంచరించిన పిమ్మట చారి గృహోన్ముఖు డయ్యాడు. రైలు ఈపాటికి వెళ్లిపోయి ఉంటుంది. ప్రాణంకంటే మానం గొప్పది. మాన రక్షణార్థం అబద్ధా లాడటంలో తప్పు లేదు.

తా నొకటి తలచిన దైవ మొకటి తలచు నంటారు. చారి తిరిగి వచ్చేసరికి, ఇంటి ముందర ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు ఒక కూలీవాడు నిలబడి ఉన్నాడు. ఇంటి అరుగుమీద సూట్‌కేసు, ఫ్లాస్కు, నీళ్ల చెంబు విడిచి ఉన్నాయి. పక్కనే ఆత్రుత, విసుగు, కోపం నిండిన ముఖంతో అరుంధతి నిలబడి ఉంది. ఇంటి తలుపుకి తాళం కాయ వేలాడుతోంది.

చారి రాగానే కూలీవాడు సామానులంతా నెత్తిమీదికి ఎత్తుకునేశాడు.

"ఇదేమిటీ? ఎక్కడికీ? ... ముకుందం కనిపించలేదు ..." అంటూ చారి వారించబోయాడు.

అరుంధతి చిచ్చుబుడ్డిలా కస్సుమంది. "చాల్లెండి ఇక! ఎందుకు కనిపిస్తాడు మీకు? అసలు ఈ పెళ్లికి వెళ్లాలనుంటేగా మీకు? ఆ ముకుందంగారే డబ్బు పంపించారు. ఇకనైనా నడవండి స్టేషన్‌కు!"

చారి ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు. ఇక తాను ఓటమి నుండి తప్పించుకోవడానికి ఒక్క అవకాశం మాత్రం మిగిలి ఉంది.

"అయితే, ఇప్పుడు రైలేదీ?"

"ఈ పూట రైలు రెండుగంటలు ఆలస్యం బాబూ!" అన్నాడు కూలీవాడు.

హతాశుడైన చారి నిరుత్తరుడైపోయాడు. ఇక తాను చేయగలిగిం దేమీ లేదు.

సంకల్పశూన్యుడైన చారి కూలీవాడి నెత్తిమీది సూట్‌కేసులా స్టేషన్‌వైపు సాగాడు.

Ⓟ

